హన్సిని
# టుడే స్మార్ట్ ఎడిషన్
http://www.todaytelugudaily.in | తెలుగుదినపత్రిక
· తెలంగాణ
గురువారం-13-02-2025
· లోకల్ సాయంత్రం 5 pm





## మేడారంలో కొనసాగుతున్న
# మినీజాతర

గురువారం ఉదయం సూర్యోదయానికి ముందు పూజారులు వనదేవతల మందిరాలకు చేరుకొని తల్లులకు శనివారం వరకు అంతర్గత పూజాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. ఇక మినీ జాతర ప్రారంభమైన నేపథ్యంలో మేడారానికి భక్తులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. మండమెలిగె పండుగ సందర్భంగా తల్లుల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

## డోలు వాయిద్యాలతో మారు మ్రోగిన మేడారం...

ములుగు టుడే ప్రతినిధి :మేడారం లో మినీ జాతర కొనసాగుతోంది. బుధవారం రాత్రి పూజారులు సమ్మక్క పూజ మందిరం నుంచి పసుపు, కుంకుమ, నైవేద్యం తీసుకువచ్చి సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఆదివాసీల నృత్యాలు, డోలు వాయిద్యాలతో మేడారం మారు మ్రోగింది. తాడ్వాయి మండలం, మేడారంలో వనదేవతలు సమ్మక్క-సారలమ్మల మినీ జాతర బుధవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు జరిగే ఈ వేడకలో భాగంగా తొలిరోజు ప్రధాన ఘట్టంగా మండమెలిగె కార్యక్రమాన్ని పూజారులు నిర్వహించారు. తెల్లవారుజామున గంగా స్నానాలు ఆచరించారు. అనంతరం మేడారంలోని సమ్మక్క మందిరం, కన్నెపల్లిలోని సారలమ్మల మందిరాన్ని మహిళలు శుద్ధి చేసి తల్లుల ఆది స్థానాలను అలుకుపూతలు చేసి ముగ్గులు వేశారు.వనదేవతల అంతర్గత మందిరాల్లో సమ్మక్కకు సిద్దబోయిన వంశీయులు, సారలమ్మకు కాక వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా గ్రామంలోని దేవతలను పూజించారు. దీప దూప నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డోలు వాయిద్యాల నడుమ గ్రామానికి నాలుగు వైపులా ద్వార స్తంభాలు ఏర్పాటు చేసి దిష్టి తోరణాలు కట్టారు. ఈ క్రమంలో వనదేవతల గుడుల్లో మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. ఆనవాయితీలో భాగంగా చర్ప వంశీయులు దివంగత మాజీ ఎమ్మెల్యే చర్ప భోజరావు కుటుంబ సభ్యులు సహా ఊరట్టం గ్రామం నుంచి డోలు వాయిద్యాల నడుమ సెలపెయ్యను గద్దెల వద్దకు తీసుకొచ్చి సమ్మక్క, సారలమ్మ పూజారులకు అందజేశారు. అనంతరం సాయంత్రం ఇలవేల్పులను ఘనంగా తమ తమ మందిరాలకు చేర్చారు. డోలు వాయిద్యాలు, కొమ్ము శబ్దాల నడుమ మహిళలు నీళ్లు ఆరబోస్తుండగా వడ్డెలు (పూజారులు) గద్దెల వద్దకు చేరుకొని జాగారం చేశారు. గురువారం ఉదయం సూర్యోదయానికి ముందు పూజారులు వనదేవతల మందిరాలకు చేరుకొని తల్లులకు శనివారం వరకు అంతర్గత పూజాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. ఇక మినీ జాతర ప్రారంభమైన నేపథ్యంలో మేడారానికి భక్తులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. మండమెలిగె పండుగ సందర్భంగా తల్లుల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తొలిరోజు సుమారు 2.5 లక్షల మంది మేడారం చేరుకున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

## శివరాత్రి జాతర వరకైనా నీటిని విడుదల చేయండి..

వేసవికాలం రాకముందే గోదావరి నదిలో నీటి ప్రవాహం పూర్తిగా అడుగంటింది. మంచిర్యాలలో గోదావరి ఒడ్డున సమ్మక్క-సారలమ్మ మినీ జాతర బుధవారం నుంచి ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరుగనున్న జాతరకు జిల్లా వాసులతోపాటు పొరుగు జిల్లాల భక్తులు ఇక్కడకు వచ్చి పుణ్యస్నానాలు ఆచరించి, మొక్కులు చెల్లించుకుంటారు. ప్రస్తుతం గోదావరిలో స్నానం చేసేందుకు తగినంత నీరు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఈ నెల 26న శివరాత్రి సందర్భంగా జిల్లా కేంద్రంలో జాతరను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గోదావరిలో లక్షల మంది పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. భక్తులు స్నానాలు ఆచరించేనందుకు నీరు అందుబాటులో లేదు. కనీసం శివరాత్రి జాతర వరకైనా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని భక్తు లుకోరుతున్నారు.





# హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలురాయి..



**సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు**

భవిష్యత్తు ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దేనని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వ సహకారంతో మైక్రోసాఫ్ట్ ఏఐ సెంటర్ ఏర్పాటు చేస్తుందని గర్వంగా చెబుతున్నానని అన్నారు.

2

**టుడే హైదరాబాద్** :మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని ఉద్యోగాలు లభించనున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో మరో కొత్త మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించుకోవడం మనందరికీ గర్వకారణంగా ఉందని తెలిపారు. హైదరాబాద్ జర్నీలో ఇదొక మైలురాయి అని చెప్పారు. మైక్రోసాఫ్ట్, హైదరాబాద్ మధ్య సుదీర్ఘ భాగస్వామ్యం ఉందని అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ విస్తరణలో భాగంగా నూతన భవనాన్ని ఇవాళ (గురువారం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్‌లో ఏఐ సెంటర్ ఏర్పాటుకు మైక్రోసాఫ్ట్‌తో తమ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకున్నట్లు ప్రకటించారు.మైక్రోసాఫ్ట్ ఇండియా ఇటీవలే 25 ఏళ్లు పూర్తి చేసుకుందని గుర్తుచేశారు. మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ నుంచి గ్లోబల్ ఇన్నోవేషన్, ఇంపాక్ట్ క్రియేట్ చేసిందని తెలిపారు. ఇది యువతకు మరింత సాధికారత కల్పిస్తుందని చెప్పడానికి తాను సంతోషిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తు ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దేనని ఉద్ఘాటించారు. ఈ భాగస్వామ్యంతో తెలంగాణ, మైక్రోసాఫ్ట్ 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెట్టడంతో పాటు గవర్నెన్స్ అండ్ పబ్లిక్ సర్వీసెస్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించనుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

# స్థానికం లేనట్లే...!

- సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల పై బిగ్ అప్డేట్..
- తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు,
- ఎన్నికల నిర్వహణ మరింత ఆలస్యం....?
- రిజర్వేషన్ల లెక్క తేలిన తర్వాతే ఎన్నికలు...?

2




**టుడే హైదరాబాద్** :స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావాహులకు ఇది నిజంగా బ్యాడ్‌న్యూసే. ఎందుకంటే ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేదని తెలుస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని సర్కార్ చెబుతుండగా.. ఆ బిల్లును అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిసైడ్ అయింది. కేంద్రం ఆమోదం తర్వాతే ఎన్నికల నిర్వహణ ఉంటుందని.. అందుకు మరికొంత సమయం పడుతుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి.తెలంగాణ పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మ్మొదలైంది. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీ చేసేందుకు పలువురు ఆశావాహులు సిద్ధమయ్యారు.ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు కొన్ని చోట్ల




## హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలురాయి...



### మొదటి పేజీ తరువాయి

ఈ పెట్టుబడి తమ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడంతోపాటు మెంటార్షిప్, ఏఐ టూల్స్, గ్లోబల్ నెట్‌వర్క్ యాక్సెస్‌ను చేస్తుందని అన్నారు. తమ ప్రభుత్వ సహకారంతో మైక్రోసాఫ్ట్ ఏఐ సెంటర్ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ కేంద్రం ఏఐ నాలెడ్జ్ హబ్ సహా క్లౌడ్ ఆధారిత ఏఐ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుందన్నారు. తెలంగాణపై నమ్మకం ఉంచిన మైక్రోసాఫ్ట్ లీడర్ షిప్ టీమ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆవిష్కరణల పట్ల మీ నిబద్ధత మా తెలంగాణ రైజింగ్ విజన్‌కు తోడవుతుందని సీఎం రేవంత్‌రెడ్డిపేర్కొన్నారు

## మణిపూర్‌ను హత్యాక్షేత్రంగా మారుస్తున్నారు

మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ మరో మార్గం లేక ఎట్టకేలకు రాజీనామా చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా తమకు విశ్వాసపాత్రుడైన బీరెన్ సింగ్‌ను అన్ని విధాలుగా రక్షించడానికి శాయశక్తులా ప్రయత్నించారు. కానీ ఫలితం లేకపోయింది. బిజెపిలో బీరెన్ సింగ్‌పై తిరుగుబాటు పెరగడంతో, కేంద్ర నాయకత్వం మిన్నకుండిపోయింది. బీరెన్ పదవి నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. మణిపూర్‌లో పరిస్థితి జాతి–మత ఘర్షణలతో దిగజారుతున్న తరుణంలో కేంద్ర నాయకత్వం ఆయన రాజీనామాను ఆమోదించి ఉంటే%ౌ%బహుశా అక్కడ జరిగిన ఊచకోతను నివారించగలిగేది. కేంద్రంలో 2014లో మొదటిసారిగా మోడీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి, ఈశాన్య ప్రాంతం సంఘ్ పరివార్‌కు ప్రయోగశాలగా మారింది. ఈశాన్య రాష్ట్రాలలో క్రైస్తవుల సంఖ్య ఎక్కువగా ఉండటం ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్‌లకు ఎప్పుడూ నచ్చలేదు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి కార్యకర్తలను తీసుకురావడం ద్వారా ఈశాన్య ప్రాంతంలో తన ప్రభావాన్ని పెంచుకోవడానికి ఆర్‌ఎస్‌ఎస్ తీవ్రంగా ప్రయత్నించింది. కానీ ఫలించలేదు. అయితే, 2014లో కేంద్రంలో అధికార మార్పు ఈశాన్య ప్రాంతంలో సంఘ్ పరివార్‌కు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించింది. కేంద్ర ప్రభుత్వ మద్దతుతో బిజెపి ఈశాన్య రాష్ట్రాల్లో మెల్లగా అధికారాన్ని చేజిక్కించుకుంది. కాంగ్రెస్‌ను చీల్చడం ద్వారా అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, మణిపూర్‌లలో బిజెపి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ వరుసగా 15 సంవత్సరాలు పాలించిన మణిపూర్‌లో బిజెపి పట్టు సాధించింది బీరెన్ సింగ్ ద్వారానే. ఆయన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు. అంతేగాక మణిపూర్ ముఖ్యమంత్రి ఓక్రామ్ ఇబోబి సింగ్‌కు అత్యంత సన్నిహితుడు. 2016లో, బిజెపి బీరెన్ సింగ్‌ను ‘ఆపరేషన్ కమల్’తో ఆకట్టుకుంది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో 28 సీట్లతో కాంగ్రెస్ ఏకైక అతి పెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, కేవలం 21 సీట్లు మాత్రమే ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాన్రాడ్ సంగ్మా నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ ఫ్రంట్, నాగా పీపుల్స్ ఫ్రంట్ మద్దతుతో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీరెన్ సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఫుట్‌బాల్ ఆటగాడైన బీరెన్ మణిపూర్ రాష్ట్ర జట్టు సభ్యుడు. ఆ క్రమంలోనే బిఎస్‌ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్)కు ఎంపికయ్యాడు. ఫుట్‌బాల్ మైదానంలో వింగ్ బ్యాక్ స్థానంలో ఆడిన ఆయన, రాజకీయాల్లో స్ట్రైకర్ పాత్రకు మారాడు. బిజెపికి పూర్తి మెజారిటీ లేకపోవడంతో అప్పటి బీరెన్ సింగ్ ప్రభుత్వ పాలన ప్రశాంతంగా జరిగింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో, బిజెపి 32 సీట్లు గెలుచుకుని సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. ‘ఆపరేషన్ ఆకర్ష్’ ద్వారా వచ్చిన ఐదుగురు ఎమ్మెల్యేలతో, 60 మంది సభ్యులున్న అసెంబ్లీలో బిజెపి బలం 37కి పెరిగింది. దీనితో, పాలనా శైలి కూడా మారిపోయింది. కేవలం 33 లక్షల మంది జనాభా కలిగిన చిన్న రాష్ట్రమైన మణిపూర్‌లో, మెయితీలు 53 శాతంగా ఆధిపత్య సమూహంగా ఉన్నారు. నాగాలు 20 శాతం, కుకీలు 16 శాతం ఉన్నారు. పంగల్, కోమ్ వంటి చిన్న సమూహాలు కూడా ఉన్నాయి. మెయితీలలో కేవలం 10 శాతం మంది మాత్రమే క్రైస్తవులు కాగా, కుకి–నాగా సమాజంలో ఎక్కువ మంది క్రైస్తవులు వున్నారు. 1864 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఇంఫాల్ లోయ, దాని చుట్టూ కొండలతో మణిపూర్ ప్రకృతి దృశ్యం ఆకట్టుకుంటుంది. మెయితీలు పూర్తిగా లోయలలోను, కుకీలు, నాగాలు ఎక్కువగా కొండలలోనూ నివసిస్తారు. విద్వేష రాజకీయంసంఘ్ పరివార్ క్రైస్తవ కుకీల పట్ల మెయితీలలో విద్వేషాన్ని రగిలించడం ద్వారా చీలిక రాజకీయాలకు పాల్పడుతోంది. బిజెపికి పూర్తి మెజారిటీ రావడంతో, విద్వేష రాజకీయాలు తీవ్రమయ్యాయి. ఆర్‌ఎస్‌ఎస్ నమూనాతో పనిచేసే అరంబై తెంకోల్, మెయితీ లీపున్ వంటి సంస్థలు సంఘ్ పరివార్ సహాయంతో క్రియాశీలకంగా మారాయి.

# స్థానికం లేనట్లే...!



### మొదటి పేజీ తరువాయి

లోపాయికారి ప్రచారం కూడా మ్మొదలుపెట్టారు. కొన్ని గ్రామాల్లో అయితే ప్రత్యేక మేనిఫెస్టోలు, సర్పంచ్ పదవి వేలం పాటలు కూడా నిర్వహిస్తున్నాట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరో వారం, పది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందని ఆశగా చూస్తున్నారు. గతంలో పలువురు మంత్రులు కూడా త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు. అయితే తాజాగా.. స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పట్లో ఎన్నికలు జరిగేలా లేవు. ఎలక్షన్స్ మరింత ఆలస్యమయ్యే ఛాన్స్ ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో జరిగిన కాంగ్రెస్ బీసీల సదస్సులో ఆ వర్గానికి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించింది. ఈ మేరకు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. రాష్ట్రంలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. బీసీ రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ కమిషన్‌ను సైతం నియమించింది. కాగా సర్వేలో బీసీల లెక్కతేలటంతో పాటుగా..డెడికేటెడ్ కమిషన్ తమ నివేదికను ప్రభుత్వానికి నివేదించింది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే కులగణన సర్వేలో పాల్గొనని వారికి మరోసారి ఛాన్స్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికలు ఇప్పట్లో జరిగే ఛాన్స్ లేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రిజర్వేషన్ల బిల్లు అసెంబ్లీ ఆమోదం పొందాక పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని తెలిపాయి. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్లపై బుధవారం పోలీసు కమాండ్ కంట్రోలు సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలు, బీసీ డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదికపై మంత్రులు, ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. అసెంబ్లీ తీర్మానం, కేంద్రం ఆమోదం తర్వాతే ఎన్నికలు నిర్వహించాలనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. కేంద్రం ఆమోదం తర్వాత.. రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకొని ఎలక్షన్ కమిషన్‌కు నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఆ తర్వాతే ఎన్నికలు జరనున్నాయి. ఈ ప్రక్రియకు మరికొంత

# రీసర్వే చేయడం లేదు, వారి కోసం పొడిగింపు: కుల గణనపై మంత్రి పొన్నం ప్రభాకర్

- కుల గణనలో చాలామంది పాల్గొనలేదన్న మంత్రి
- ఈ క్రమంలో 28 వరకు పొడిగించినట్లు స్పష్టీకరణ
- బీఆర్‌ఎస్ నేతలు సర్వేలో పాల్గొనాలని సూచన

తెలంగాణలో ఈ నెల 16 నుండి 28 వరకు జరిగే కుల గణన రీసర్వే కాదని, సర్వేలో పాల్గొనని వారి కోసం దీనిని నిర్వహిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఇదివరకటి నిర్వహించిన కుల గణన సర్వేలో చాలామంది పాల్గొనలేదని, తమ సమాచారం ఇవ్వలేదని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో గడువును ఫిబ్రవరి 28 వరకు పొడిగించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే దేశంలోని అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన అన్నారు. సర్వేలో పాల్గొనకుండా బీఆర్‌ఎస్ నేతలు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రజాస్వామ్యం మీద చిత్తశుద్ధి ఉంటే బీఆర్‌ఎస్ అగ్రనేతలు సర్వేలో పాల్గొనాలని ఆయన సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ బడా వ్యాపారస్తుల పార్టీ అని ఆయన దుయ్యబట్టారు. కుల గణన, బీసీ, ఎస్సీ వర్గీకరణ ఆ పార్టీకి ఇష్టం లేదని ఆరోపించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణలో రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. సర్వే పూర్తయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని ఆయన అన్నారు. రాజకీయ విమర్శల కోసమే బీజేపీ నేతలు బీసీలు, ముస్లింలపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ముస్లిం కమ్యూనిటీలోని పేదలు బీసీలోనే కొనసాగుతున్నారని ఆయన స్పష్టం చేశారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. బలహీన వర్గాలపై బీజేపీకి నిజంగా ప్రేమ ఉంటే అసెంబ్లీలో బిల్లును అడ్డుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.



# మొయినాబాద్ కోడి పందేల కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీకి పోలీసుల నోటీసులు

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి పోలీసుల నోటీసులు
- కోడి పందేల నిర్వహణపై వివరణ ఇవ్వాలని పేర్కొన్న పోలీసులు
- మొయినాబాద్ మండలంలో క్యాసిన్, కోడిపందేల నిర్వహణ కేసులో పలువురి అరెస్ట్

హైదరాబాద్ నగర శివారులోని మొయినాబాద్ మండలంలో ఒక ఫాంహౌస్‌లో కోడిపందేల నిర్వహణ కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. మాదాపూర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి నోటీసులు అందించారు. కోడి పందేల నిర్వహణపై వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. ఈ ఫాంహౌస్‌ను భూపతిరాజు అనే వ్యక్తికి లీజుకు ఇచ్చామని ఎమ్మెల్సీ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించి పూర్తి సమాచారం ఇవ్వాలని పోలీసులు ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ కేసులో పోచారం శ్రీనివాస్ రెడ్డిని కూడా పోలీసులు నిందితుడిగా చేర్చారు. మొయినాబాద్ మండలం తొల్కట్ట ఫాంహౌస్‌లో మంగళవారం పోలీసులు నిర్వహించిన దాడుల్లో 64 మందిని అరెస్ట్ చేశారు. క్యాసినో, కోడిపందేల నిర్వహణ జరుగుతున్నట్లుగా సమాచారం అందడంతో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఆర్గనైజర్లు భూపతిరాజు, శివకుమార్‌లను అరెస్ట్ చేశారు. సంఘటన స్థలంలో రూ.30 లక్షలు, 55 లగ్జరీ కార్లు, 86 పందెం కోళ్లు, బెట్టింగ్ కాయిన్లు, పేకాట కార్డులు, పందెం కోళ్ల కోసం ఉపయోగించే 46 కోడి కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన 64 మందిలో 51 మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు, ఏడుగురు హైదరాబాద్ వాసులు ఉన్నారు.

# ఏలూరులో మనిషికి సోకిన బర్డ్ ఫ్లూ....

- తొలి కేసు నమోదైందని నిర్ధారించిన వైద్య శాఖ
- మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసిన అధికారులు
- ఉభయ గోదావరి జిల్లాల్లో 50 లక్షల కోళ్ల మృతి

ఆంధ్రప్రదేశ్ లో బర్డ్ ఫ్లూ కలకలం రేగుతోంది. ఏలూరు జిల్లాలో ఓ వ్యక్తికి బర్డ్ ఫ్లూ సోకినట్లు వైద్యశాఖ అధికారులు నిర్ధారించారు. జిల్లాలోని ఉంగుటూరు మండల పరిధిలో కోళ్ల ఫారం సమీపంలో ఉంటున్న వ్యక్తికి ఈ వైరస్ సోకినట్లు తేలింది. దీంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రత్యేకంగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి బర్డ్ ఫ్లూ లక్షణాలు ఉన్న వారిని ప్రత్యేకంగా పరీక్షిస్తున్నారు. శాంపుల్స్ సేకరించి ల్యాబ్ కు పంపిస్తున్నారు. ఏపీలో మనుషుల్లో బర్డ్ ఫ్లూ వైరస్ కు సంబంధించి తొలి కేసు నమోదైందని అధికారులు చెప్పారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఉమ్మడి కృష్ణా జిల్లాలో బర్డ్ ఫ్లూ వైరస్ తీవ్రత ఎక్కువగా ఉంది. కానూరులో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లు ఇప్పటికే నిర్ధారణ కాగా, ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 50 లక్షల పైచిలుకు కోళ్లు ఈ వైరస్ తో చనిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. కొంతకాలం పాటు చికెన్ కు దూరంగా ఉండాలని వైద్య శాఖ అధికారులు ప్రజలకు సూచించారు. అధికారుల హెచ్చరికలు, సోషల్ మీడియాలో ప్రచారం కారణంగా చికెన్ కొనుగోళ్లు తగ్గడంతో తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు పడిపోయాయి.

